# చదువురాదా!




ఒంగోలు బస్సుస్టాండు. సాయంత్రం మూడు గంటలు. జనం రద్దీగా లేరు. గుంటూరు వెళ్ళే బస్సులు యింకా రాలేదు. విచారణ కౌంటరులో ఇంకా అర్ధగంట టైం ఉందన్నారు. సరేనని బెంచీమీద కూర్చున్నాను. అన్ని గ్రామాలకు పోయే బస్సులు రావడం, పోవడం జరుగుతున్నది. యింతలో రిక్షాదిగివస్తున్న ఒకామెమీద నా కళ్ళుపడ్డాయి. చూపులకు ఆమె ఎవరో సినిమా నటిగా గోచరించింది. కట్టు, బొట్టు ఆకారం అక్షరాలా సినిమా నటియేకావచ్చుననే భావన కలిగింది. ఎందుకంటే ఈ రోజుల్లో రోజుకొక హీరో, గంటకొక హీరోయిను మారే కాలంగదా! కళ్ళకు కూలింగు గ్లాసులు, చేతిలో బ్యాగు, పట్టుచీరలో ఎంతో అందంగా ఉంది. లక్షాధికారి అయి ఉంటుంది. కారులో రాక, ఈ నడక యేమిటి అనుకున్నాను. నా ఆలోచనలకు అంతులేకుండా పోయింది. ఎప్పుడెప్పుడు పలుకరిద్దామా అనివుంది. నేరుగా విచారణ కౌంటరుకేసి నడిచింది. నేను వెళ్ళాను. గుంటూరు బస్సు టైం అడిగింది. నేనే కల్పించుకుని చెప్పాను. మీరు ఏ వూరు వెళ్ళాలండి అని అడిగాను. చెప్పింది. ఆ బెంచీమీద కూర్చుందాం రండి అన్నాను. వచ్చింది. కూర్చుంది. ఏం మాట్లాడాలో అర్థం కాలేదు. సినిమా యాక్టరని అడుగుదామా! ఏ వూరని ప్రశ్నిద్దామా? మీవారు ఏం చేస్తుంటారని అడుగుదామా? యిన్ని ఆలోచనలతో ఆమెను చూస్తూ ఏమి అడగలేకపోయాను. ఆమె నన్నడిగింది. మీరు ఎక్కడికి వెళ్ళాలి అని. చెప్పాను. మీ పేరేమిటండి అని అడిగింది. చెప్పాను. నేను ధైర్యంచేసి అన్నీ అడిగాను.

"నాపేరు రాధండి. గుంటూరులో ఒక కాలేజీని నడుపుతున్నాను. పది సంవత్సరాల నుండి సాగిస్తున్నాను. మా దగ్గర ఎందరో పనిచేస్తున్నారు. ఎందరి పిల్లలో పై చదువులు చదివారు. ఈ పది సంవత్సరాలలో కనీసం పది లక్షలు సంపాదించాను. నాకు గుంటూరులో, నాలుగు మేడలు ఉన్నవి". మాటల్లో పడిపోయిన మాకు గుంటూరు బస్సువచ్చిన సంగతి గుర్తులేదు. మైకులో ప్రకటన వినగానే లేచి వెళ్ళి బస్సెక్కాము. ఎక్కిన వెంటనే బస్సు కదిలింది. టిక్కెట్లు తీసుకొని ఒకే సీట్లో ప్రక్కప్రక్కనే కూర్చున్నాం. "నాలుగు మేడలు కదండి చెప్పింది. రెండొందల సవర్ల బంగారం, ఇళ్ళ స్థలాలు పదిప్లాట్లు, ఇంకా అనేకం అంటూ బస్సులో సాగిపోతు ఉండగానే చెప్పింది. తనకింకా పెళ్ళి కాలేదని, తన వారెవరూ లేరని చెప్పింది. పెండ్లి చేసుకునే ప్రసక్తే లేదని చెప్పింది. ఆమె వయస్సు నా చూపులకు ముప్పై దాకా ఉండవచ్చు. పేరు బాలరమణి నా గురించి అడిగింది- చెప్పాను. "ఎం.ఏ.లో బంగారుపతకం. డిగ్రీ పూర్తయి ఐదేళ్ళు గడిచినా ఉద్యోగం లేదు. నామీద ఆశలు పెట్టుకొని జీవించే తల్లి ఒక్కతే. యింకెవ్వరూలేరు. ఫైలు చేతబట్టు కొని ఎన్నో ఆఫీసులచుట్టు, ప్రైవేటు కంపెనీల చుట్టు తిరిగి తిరగి విసుగుచెందాను. చివరకు గుంటూరులో ఒక మందులకంపెనీలో లెక్కలు వ్రాసేపని ఖాళీ వుందని తెలిసి పోతున్నాను అన్నాను. ఇంతలో బస్సు గుంటూరు చేరనేచేరింది. బస్సుదిగి నా అడ్రసు వ్రాసి ఆమెకిచ్చాను. తప్పక ఒకసారి కాలేజీకి వస్తానని చెప్పి, కలం, కాగితం యిచ్చి అడ్రసువ్రాసి యిమ్మన్నాను. "నాకు చదువురాదండి. నా అడ్రసు మీరే రాసు కోండి"అంది. అంతే నా తల తిరగిపోయింది. చదువు రాదా!

—ఇమ్మడిశెట్టి సోమయ్య

## కాలక్షేపానికి కథ

మూడురోజులుగా కష్టమర్సు ఎవరూ రాకపోవడంతో బెంబేలుపడి, కౌంటర్లో దిగులుగా కూర్చున్నాడు"పరిమళా క్లాత్ స్టోర్స్" మేనేజరు రంగయ్య. ఇంతలో ఓ బట్టతల మనిషి షాపులోకి అడుగు పెట్టాడు. రంగయ్య పరమానందంతో "రండిసార్! రండి" అని ఆహ్వానించాడు.

"బట్టలు మంచివి వున్నాయా"అడిగారు బట్టతల శాస్త్రిగారు. "చీరలు, లుంగీలు, షర్టులు, ప్యాంటులు అన్నీమంచిరకాలనేవున్నాయి. మీకేం కావాలో చెప్పండి" అడిగాడు రంగయ్య. బట్టతల వ్యక్తి షాపులోని అరలవంక చూశాడు.

# బట్ట(త)ల బేరం

అన్నిటికంటే పైన వున్న అరలవైపు చూపిస్తూ "ఆ మూడవ అరలో నాలుగవ చీర ఎర్రదేకదండీ" అడిగాడు బట్టతల వ్యక్తి. "ఔనండీ! చూస్తారా" అడిగాడు రంగయ్య. "వద్దులెండి! ఆ ప్రక్క అరలో అన్ని లుంగీలకంటే క్రిందవున్నది నీలిగళ్ళదే కదండీ! ఆ ఎదుటి అరలో మూడోది పసుపుపచ్చది కదండీ! ఈవైపు చివరి అరలోది ఆకుపచ్చచీర కదండీ" ఇలా దాదాపు ఒకనంద బట్టలను చూపించి, శల్యపరీక్షచేశాడు బట్టతల వ్యక్తి. రంగయ్య "అవన్నీ పాక్ చేయించమంటారా" అడిగాడు ఆనందంగా.



"చూడునాయనా! నువ్వేమి అనుకోకు! నాకీ మధ్య కంటి చూపు తగ్గినట్లు అనుమానం వచ్చింది. దాన్ని తీర్చుకుందామని నీ షాపుకు వచ్చాను. చూశావా, ఏ రంగుబట్టలైనా సులువుగా గుర్తుపట్టేశాను. ఇక నా కంటి చూపు గురించి నాకేచింత లేదు. వెళ్ళి వస్తాను"అని చెప్పి, పైకి లేచాడు బట్టతలవ్యక్తి.

"సార్! మీకంటి చూపు బాగున్న ఈ శుభ సందర్భంలో మా షాపులో ఓ పట్టు చీరకొని మీ ఆవిడకివ్వచ్చుకదా" అభ్యర్థించాడు రంగయ్య! ఎంతైనా వ్యాపారికదా!

బట్టతల వ్యక్తి రంగయ్యవైపోసారి చూచి "ఏమను కోకోయ్! నేను బ్రహ్మచారిని" అని చెప్పి వెళ్ళిపోయాడు.

-కె.నారాయణరెడ్డి